నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




మంచిర్యాలటౌన్ : రంగంపేట కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న రాళ్ల వాగు

# వరద టెన్షన్

## ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తిన అధికారులు

- ఎస్సారెస్పీ, కడెం నుంచి పెరుగుతున్న వరద
- గోదావరిలోకి ఆరు లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- మరింత ఉగ్రరూపం దాల్చే అవకాశం
- మంచిర్యాల పట్టణానికి పొంచి ఉన్న ముప్పు
- మాతా శిశు సంరక్షణ కేంద్రం రోగులను తరలించిన అధికారులు
- అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు

మంచిర్యాల, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి ఉగ్రరూపం దాల్చుతుండగా, మంచిర్యాల పట్టణ ప్రజలకు వరద టెన్షన్ పట్టుకున్నది. కడెం ప్రాజెక్టుకు ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సోమవారం ఉదయానికి 2.30 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. మొత్తం 18 గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. అలాగే ఎస్సారెస్పీ ప్రాజెక్టు 40 గేట్లు ఎత్తి 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఈ సీజన్‌లో అత్యధికంగా సోమవారం ఉదయం ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని ఎల్లంపల్లి నుంచి దిగువకు వదిలారు. సోమవారం మధ్యాహ్నానికి 30 గేట్లు 4 మీటర్ల మేర ఎత్తి నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇటు కడెం, అటు ఎస్సారెస్పీ ప్రాజెక్టుల నుంచి వదిలిన వరద సోమవారం రాత్రికి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే ప్రస్తుతం 6 లక్షల క్యూసెక్కులు ఉన్న వరద 8 లక్షల నుంచి 10 లక్షల క్యూసెక్కులకు పెరగొచ్చని వారు పేర్కొంటున్నారు.

### రాళ్ల వాగు రివర్స్ వస్తే..

ఎల్లంపల్లికి వరద పోటెత్తుతుండగా మంచిర్యాల పట్టణవాసుల్లో టెన్షన్ పెరిగిపోతున్నది. లోతట్టు ప్రాంతాల వాసులు గజగజ వణికిపోతున్నారు. 6 లక్షల క్యూసెక్కులు దిగువకు వదలడంతో పట్టణం గుండా ప్రవహించే రాళ్లవాగు నీరు గోదావరిలోకి వెళ్లకుండా నిశ్చలంగా మారిపోయింది. యేటా గోదావరి వరద ఎక్కువగా రావడం, రాళ్లవాగు నీరు గోదావరిలోకి వెళ్లలేక పట్టణంలోకి రివర్స్ వచ్చి లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడం జరుగుతుంది. సోమవారం రాత్రి భారీ వరద వచ్చే అవకాశాలున్నాయని ఇరిగేషన్ అధికారులు చెబుతుండగా, భయాందోళనలు నెలకొన్నాయి. ఎమ్మెల్యే పీఎస్సార్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ ఇతర అధికారులు సోమవారం ఉదయం ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. భారీ వరద వస్తే తట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి నీరు చేరకుండా 15 టీఎంసీలు మాత్రమే ఉండేలా చూస్తున్నామని, 18 టీఎంసీల వరకు పెరిగినా రెండు, మూడు గంటల పాటు ఆపేస్తామని తెలిపారు. కడెం, ఎస్సారెస్పీ నుంచి 6 లక్షల క్యూసెక్కుల నుంచి 8 లక్షల క్యూసెక్కుల వరద సోమవారం రాత్రి వరకు వచ్చే అవకాశాలున్నాయని, ఆ మేరకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.

### ఎంసీహెచ్ నుంచి రోగుల తరలింపు

గోదావరికి మరింత వరద ఉధృతి పెరిగే అవకాశముండగా, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) రోగులను తరలించారు. గతంలో భారీ వరదలు వచ్చి హాస్పిటల్ ఫస్ట్‌ఫ్లోర్ వరకు మునిగిపోయిన ఘటనల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రోగులను తరలించినట్లు డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ తెలిపారు. ఎమ్మెల్యే పీఎస్సార్, కలెక్టర్ కుమార్ దీపక్ సూచనల మేరకు దవాఖానలోని 130 మంది ఇన్ పేషెంట్లను సురక్షితంగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్), ఇతర ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తరలించామన్నారు. అలాగే 21 ఐఎన్‌సీయూ కేసులు, 7 డెలివరీ అయిన కేసులు, 57 పోస్టాఫ్ కేసులు, ఐసీయూలో 8 కేసులు, పీడియాట్రిక్‌లోని 37 కేసులను ప్రభుత్వ అంబులెన్సులు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ అంబులెన్స్‌లలో తరలించారు. ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లిన వారికి మెడిసిన్ కిట్స్ ఇచ్చి పంపించారు. జీజీహెచ్‌కు పంపిన వారి కోసం ఎంసీహెచ్ నర్సులు, డాక్టర్లను అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఎన్టీఆర్‌నగర్, రాంనగర్ ముంపు ప్రాంత్రాల్లో జనాలను అప్రమత్తం చేశారు. వరద పెరిగి ముంపు వస్తే ముందుగా ప్రభావితమయ్యే ఇళ్లలోని వారిని సామగ్రి సర్దుకొని సిద్ధంగా ఉండమని చెప్పారు. ఈ రాత్రి వరద ఉధృతి తగ్గితే ప్రమాదమేమీ ఉండదు. ఒక వేళ వరద తీవ్రత పెరిగితే ముంపు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్న వరద



చెన్నూర్ : వర్షానికి తెగిన కల్వర్టు వద్ద మరమ్మతులు చేస్తున్న కాలనీ వాసులు



మంచిర్యాలటౌన్ : నిండుగా ప్రవహిస్తున్న గోదావరి నది



ఎంసీహెచ్ నుంచి రోగిని తరలిస్తున్న సిబ్బంది



మంచిర్యాల : ఎన్టీఆర్ నగర్‌లోకి చేరిన వరద



కోటపల్లి మండలం పారుపల్లి వద్ద గోదావరి ఉధృతి



ఎంసీహెచ్ నుంచి పేషెంట్లను తరలించడానికి వచ్చిన 108, 102 అంబులెన్సులు



ఎంసీహెచ్ నుంచి బయటకు వస్తున్న బాలింతలు, బంధువులు



ఎంసీహెచ్ నుంచి బాలింతను తీసుకెళ్తున్న సిబ్బంది



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : అడ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరద పరవళ్లు



మంచిర్యాల ఎంసీహెచ్ అంబులెన్స్‌లోకి ఎక్కుతున్న బాలింతలు, గర్భిణులు



ఎంసీహెచ్ మెట్లపై తన బిడ్డను ఎత్తుకొని కూర్చున్న బాలింత

# అంతిమయాత్రకు అవస్థలు

## మృతదేహంతో ఒర్రెదాటి అంత్యక్రియలు నిర్వహించిన బంధువులు

మందమర్రి, సెప్టెంబర్ 2 : అనారోగ్యంతో ఓ వృద్ధుడు మృతి చెందగా, ఉధృతంగా ప్రవహిస్తున్న ఒర్రెను అతికష్టం మీద దాటి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపాలిటీలో ఆదివారం జరిగింది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీకి చెందిన రాజయ్య(68) అనే వృద్ధుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విద్యానగర్‌లో ప్రారంభమైన అంతిమయాత్ర జాతీయ రైల్వే లైన్ వంతెన వరకు సాఫీగానే సాగింది. వర్షాలకు దాని సమీపంలో ఉన్న ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తుండగా, వృద్ధుడి మృతదేహాన్ని ఎత్తుకొని అతికష్టం మీద అవతలికి దాటారు. అనంతరం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



వరద ప్రవాహంలో మృత దేహంతో ఒర్రె దాటుతున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

# ప్రజలు ఆందోళన చెందవద్దు

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, సెప్టెంబర్ 02 : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టును ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో నెలకొన్న వరద పరిస్థితులకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలను అందిస్తుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08736-250501ను ఏర్పాటు చేశామని, అత్యవసర సమయాల్లో ప్రజలు సంప్రదించవచ్చునని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ కడెం, శ్రీరాంసాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో వరద ఉధృతి పెరిగిందని, ఈ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే, ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు తోట రవి, నాయకుడు శ్రీనివాస్ గౌడ్, ప్రాజెక్టు ఏఈలు, ఇంజినీర్లు ఉన్నారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి విడుదలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే పీఎస్సార్

# ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పరామర్శ



ఎమ్మెలే కోవ లక్ష్మిని పరామర్శిస్తున్న అరిగేల నాగేశ్వరరావు

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 2 : తీవ్రమైన జ్వరంతో హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోద హాస్పిటల్‌లో చేరి చికిత్స పొంది.. ఆపై ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

# రైతులకు న్యాయం చేస్తాం

## ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కౌటాల/సిర్పూర్(టీ), సెప్టెంబర్ 2 : మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు వార్ధా ప్రాణహిత నదులు ఉప్పొంగి తాటిపల్లి, విర్దండి గ్రామాల్లో పత్తి, మిరప పంటలు నీట మునిగిపోగా, సోమవారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సోమవారం విర్దండిలో పర్యటించారు. నీట మునిగిన పంటలను స్వయంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల వివరాలు తెలుసుకున్నారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇక్కడ ఎక్కువగా కౌలు రైతులు ఉన్నారని, వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కలెక్టర్‌కు విన్నవించారు. రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, తహసీల్దార్ పుష్పలత, ఎస్ఐ మధుకర్, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, ఏఈవోలు ఉన్నారు. అలాగే సిర్పూర్(టీ) మండలం పారిగాం గ్రామంలో వరదలో మునిగిన పత్తి పంటలను పరిశీలించారు. నాయకులు సత్యనారాయణ, సమీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### యంత్రాంగం అప్రమత్తంగా ఉంది

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 2 : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల రక్షణ కోసం అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం మాలన్ గొంది గ్రామపంచాయతీలోని తూంపల్లి వాగుపై ఉన్న కల్వర్టు, రోడ్డు వరదకు కొట్టుకుపోగా సోమవారం తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండేతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాలు అయిన మాలన్ గొంది (కొలాం గూడ), గోండు గూడ గ్రామాల మధ్య వంతెన వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో మాలన్ గొంది, కుటోద (గోండు గూడ), కుటోద (కొలాం గూడ), మాన్యాపూర్, శేఖన్ గొంది గ్రామాలకు-మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిత్యావసరాలు, వైద్య సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృషి చేయాలని తెలిపారు. ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ రాజ్ ఈఈని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నం.6304686505ను సంప్రదించాలని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



కౌటాల : విర్దండి గ్రామ శివారులో వార్ధా నది బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్



కౌటాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న తలోడి గ్రామస్తులు

# సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కౌటాల, సెప్టెంబర్ 2 : నిత్యం సమస్యలతో సతమతమవుతున్నామని, వెంటనే పరిష్కరించాలని తలోడి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సమస్యలపై పలుమార్లు కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల నేపథ్యంలో ఇండ్ల చుట్టూ మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతున్నదని, డ్రైనేజీల్లో చెత్తాచెదారం, వర్షపు నీరు నిండి రోడ్లపైకి వరద వస్తున్నదని, ఆదివారం తలోడి గ్రామ పాఠశాల సమీపంలోని డ్రైనేజీలో ఓ మూడేళ్ల బాలుడు పడిపోగా, స్థానికులు కాపాడారని చెప్పారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రెండు రోజుల క్రితం బిట్టుపల్లి గంగన్నకు చెందిన గేదె స్ట్రీట్ లైట్ పోల్ తగిలి మృతి చెందిందని ఆరోపించారు. ఏ ఒక్క రోజూ బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవని, దోమలు పెరిగి.. జ్వరాలు వచ్చి మంచం పట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో పొలాల అమావాస్య పండుగను చీకట్లో జరుపుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకొని.. గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీవో మహేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679